ప్రజాశక్తి

ఆదివారం 14 డిసెంబర్ 2025   8 పేజీలు

గుంటూరు

పల్నాడు

డ్రగ్స్ రాకెట్ ఉచ్చులో విద్యార్థులు

ఆత్మహత్యాయత్నం చేసి జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని తల్లితో మాట్లాడుతున్న ఈగల్ విభాగం ఐజి ఆకె రవికృష్ణ, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

- గుంటూరులో ఇంటర్ విద్యార్థిని ఉదంతం కలకలం
- మనస్థాపంతో తల్లి ఆత్మహత్యాయత్నం
- డ్రగ్స్ సరఫరాలో ఎబివిపి నాయకుల పాత్ర ఉన్నట్లు అనుమానాలు
- రహస్యంగా దర్యాప్తు చేపట్టిన ఎస్పి, ఐజి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో డ్రగ్స్ మాఫియా కొత్త పుంతలు తొక్కుతోంది. కళాశాల విద్యార్థులే లక్ష్యంగా గంజాయి, మత్తు పదార్థాలను అలవాటు చేయడం కోసం మాఫియాలోని కొంతమంది తొలుత సరదాగా, ఉచితంగా అలవాటు చేస్తున్నారు. తరువాత వారిని డ్రగ్స్‌కు బానిసలుగా మారుస్తున్నారు. ప్రేమ పేరుతో కొంతమంది విద్యార్థులను ఎంపిక చేసుకుని ఈ రాకెట్ నడుపుతున్నారు. పలువురు యువతులను మత్తులో దింపి వారికి తెలియకుండా లైంగిక దాడికి పాల్పడుతున్నారు. తాజాగా గుంటూరులోని లాలాపేట పరిధిలో ఒక యువతి వ్యవహారం శనివారం వెలుగు చూసింది. ఈ కేసులో నిందితులను గుర్తించిన పోలీసులు అత్యంత రహస్యంగా దర్యాప్తు చేస్తున్నారు. మైనర్ యువతికి డ్రగ్స్‌కు అలవాటు చేయగా ఆమె తల్లి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం గుంటూరులో జరిగింది.

గుంటూరులో బిజెపి అనుబంధ విద్యార్థి సంఘమైన అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి)లో పనిచేస్తున్న కొంతమంది నాయకులు ఈ డ్రగ్స్ రాకెట్‌లో కీలకంగా వ్యహరించినట్టు పోలీసుల దృష్టికి వచ్చింది. వీరిపై గోప్యంగా విచారణ చేస్తున్నారు. వీరు డ్రగ్స్ తీసుకోవడమే కాకుండా.. యువతులను కూడా ఈ ఉచ్చులోకి లాగుతున్నారని తెలిసింది. యువతి ప్రవర్తనతో తల్లిదండ్రుల మనస్తాపం చెందారు. కుటుంబంలో వివాదం ఏర్పడటంతో ఆమె తల్లి ఆత్మహత్య ప్రయత్నం చేయగా కుటుంబ సభ్యులు ఆమెను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన హోంమంత్రి అనిత దృష్టికి వెళ్లడంతో ఆమె ఆదేశాలతో ఈగల్ విభాగం ఐజి ఆకె రవికృష్ణ, జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ ఈ రాకెట్‌పై ప్రత్యేక దృష్టిపెట్టారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను రవికృష్ణతోపాటు జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ పరామర్శించారు. ప్రేమపేరుతో ఆమె డ్రగ్స్‌కు అలవాటు పడిందన్న సమాచారంతో యువతికి పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించగా కుటుంబంలో వివాదం ఏర్పడిందని, ఇందువల్ల యువతి తల్లి ఆత్మహత్యాయత్నం చేసినట్లు మీడియాకు రవికృష్ణ తెలిపారు. యువతి డ్రగ్స్ వినియోగించారా లేదా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువతిని మాదక ద్రవ్యాల ఉచ్చులోకి లాగిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. మైనర్ యువతికి, ఆమె కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పి

▶ 2లో

ఎపిఎస్‌పి బెటాలియన్‌లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

కానిస్టేబుల్ అభ్యర్థులకు 16న నియామక పత్రాలు

- ఎపిఎస్‌పి బెటాలియన్ ప్రాంగణం సభలో అందించనున్న సిఎం చంద్రబాబు
- ఏర్పాట్లను పరిశీలించిన హోంమంత్రి అనిత, ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో ఇటీవల కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికై అభ్యర్థులకు నియామక పత్రాలను మంగళగిరి పోలీసు బెటాలియన్ ప్రాంగణంలో మంగళవారం జరిగే సభలో సిఎం చంద్రబాబు అందిస్తారని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లను ఆమె శనివారం పరిశీలించారు. సభా వేదిక నిర్మాణాన్ని, వేదిక వద్దకు చేరుకునే మార్గాలను, పార్కింగ్ ప్రదేశాలను, వీఐపీల కోసం చేస్తున్న ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. ఇతర జిల్లాల నుండి వచ్చే అభ్యర్థులు, వారి బంధువులు, బందోబస్తుకు వచ్చే పోలీసులకు కల్పించాల్సిన వసతులపై సమీక్షించారు. పరిశీలనలో ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, డిఐజి సత్యఏసుబాబు, గుంటూరు ఎస్పి వకుల్ జిందాల్, బెటాలియన్ కమాండెంట్ నగేష్, జిల్లా అదనపు ఎస్పి రవికుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

పెంచడం లేదంటూనే బాదుడు

- రూ.12,617 కోట్ల భారానికి రంగం సిద్ధం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- పంటలకు మద్దతు ధరల్లేక దయనీయంగా రైతుల పరిస్థితి
- ఏడాదికి 10 వేలమంది రైతుల ఆత్మహత్య
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే సర్దుబాటు చార్జీల పేరుతో నెలనెలా వసూలు చేస్తోందని, తాజాగా రూ.12617 కోట్ల భారాన్ని ప్రజలపై వేసేందుకు రంగం సిద్ధం చేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. ఈ భారాన్ని సత్వరం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిమిత్తం నరసరావుపేటకు శనివారం వచ్చిన ఆయన స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపడంలో వైసిపి, టిడిపిలు ఒకే విధానాన్ని అవలంబిస్తున్నాయన్నారు. వైసిపి పాలనలో రూ.32 వేల కోట్ల భారాలు వేయగా కూటమి 18 నెలల పాలనలో ట్రూప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ సుంకం, అదనపు లోడ్ ఛార్జీల పేరుతో రూ.23 వేల కోట్ల భారాలతో పాటు నెలవారీ బిల్లులో ప్రతి యూనిట్‌పై 40 పైసలు వసూలు చేస్తోందని విమర్శించారు. 2019-24 కాలంలో వినియోగించుకున్న విద్యుత్ బిల్లుతో పాటు సర్దుబాటు ఛార్జీలు చెల్లించినా మళ్లీ రూ.12717 కోట్లు వసూలు

▶ 2లో

రేపు సిఐటియు జెండాల ఆవిష్కరణ

ప్రజాశక్తి- తాడేపల్లి : విశాఖపట్నంలో ఈనెల 31 నుండి వచ్చేనెల 4 వరకు సిఐటియు అఖిలభారత మహాసభల నేపథ్యంలో రాజధానిలోని కార్మిక వాడల్లో సిఐటియు జెండాలను సోమవారం ఆవిష్కరించాలని రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి పిలుపునిచ్చారు. 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే మహా కార్మిక ర్యాలీ, బహిరంగ సభకు అన్ని రంగాల కార్మికులు తరలిరావాలని కోరారు. ఈ మేరకు తాడేపల్లిలో మున్సిపల్ కార్మికులతో శనివారం నిర్వహించిన

▶ 2లో

మున్సిపల్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం.రవి

ఆస్పత్రికి తీసుకెళ్తూ హత్య

తల్లీబిడ్డ హత్యకేసును ఛేదించిన పోలీసులు

మృతురాలి భర్త అరెస్టు - ప్రియురాలి పాత్రపైనా విచారణ

వివరాలు వెల్లడించిన డీఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం పాలపాడు కాల్వ వద్ద ఈనెల 5న జరిగిన కందారపు త్రివేణి, ఆమె పశిబిడ్డ శరత్ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మృతురాలి భర్త తురాలి భర్త శ్రీకాంత్ నిందితుడుగా తేల్చారు. ఈ మేరకు వివరాలను నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ ఎంవి సుబ్బారావు, ఎస్ఐలు కిషోర్, ఫాతిమాతో కలిసి డీఎస్పీ హనుమంతరావు శనివారం వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రొంపిచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు నాదెండ్లకు చెందిన త్రివేణితో రెండేళ్ల క్రితం వివాహమైంది. అయితే నరసరావుపేటలోని ఒక ల్యాబ్‌లో పనిచేస్తున్న శ్రీకాంత్‌కు వివాహానికి ముందే ఒక

▶ 2లో

శంకర్ విలాస్ బ్రిడ్జిపై ఏకపక్ష ధోరణి

పనులను పరిశీలించిన వైసిపి నేతల విమర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

శంకర్ విలాస్ బ్రిడ్జినిర్మాణంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తోపాటు పలువురు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. ఈ పనులను వైసిపి నేతల బృందం శనివారం పరిశీలించగా రాంబాబు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం వల్ల ప్రజలు, షాపుల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సింగిల్ పిల్లర్స్‌తో ఫ్లై ఓవర్ బ్రిడ్జి తరహాలో చేపట్టాలని, అంతేగాక ఆర్‌యుబిని కూడా నిర్మించాలని 2017లో టిడిపి ప్రభుత్వ హయాంలోనే నిర్ణయించినా

▶ 2లో

డ్రగ్స్ రాకెట్ ఉచ్చులో విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)

వకుల్ జిందాల్ చెప్పారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నబజార్ ప్రాంత నివాసితులైన 17 ఏళ్ల యువతి ఇంటర్మీడియట్ చదువుచుండగా, ఆమెకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన ఇద్దరు యువకులు ప్రేమ పేరుతో ఆమెను నమ్మించి, మాదక ద్రవ్యాల మత్తుకు అలవాటు చేసి, వాటికి బానిసగా మార్చినట్లు ప్రాథమిక విచారణలో వెలుగులోకి వచ్చిందని ఎస్‌పి తెలిపారు. యువతి తల్లి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై వివరాలు తెలుసుకుని, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. డ్రగ్స్‌కు బానిసైన మైనర్ యువతికి అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించి, డీ-అడిక్షన్ కేంద్రం ద్వారా చికిత్స అందించి సాధారణ స్థితికి చేరుకునేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. యువతికి డ్రగ్స్ ఎక్కడ నుండి వస్తున్నాయి? ఎవరు ఇస్తున్నారు? అనే కోణంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారిస్తామన్నారు. గడిచిన మూడు నెలల్లో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు సేవిస్తున్న సుమారు 150 మందిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో దర్యాప్తు అనంతరం బాధ్యులను అరెస్టు చేస్తామని చెప్పారు.

రేపు సిఐటియు జెండాల ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో రవి మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కాలరాస్తోందని, ఇందులో భాగంగా లేబర్ కోడ్‌లను తెచ్చిందని చెప్పారు. వీటివల్ల కార్మికులకు పని భద్రత ఉండదని, వెట్టి చాకిరీ చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని అన్నారు. వీటి రద్దు కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. మున్సిపల్ కార్మికులకు గత జులై సమ్మె కాలపు వేతనాలను క్రిస్మస్ సందర్భంగానైనా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ డిమాండ్ చేశారు. ఎమ్‌టిఎంసి పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు సబ్బులు, నూనెలు, మాస్కులు, గ్లౌజులు, యూనిఫామ్, చెప్పులు, ఐడి కార్డ్ ,రక్షణ పరికరాలు అందజేయాలని కోరారు. సమవేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ రాజధాని ప్రాంత అధ్యక్ష కార్యదర్శులు ఎ.శాంతకుమారి, టి.బాబు, నాయకులు ఆర్.వేణు, ఎ.నారాయణ, స్వర్ణకుమారి, మేరీ, స్వరూప, కుశాలరావు, సుందర్‌రావు, సిఐటియు నాయకులు వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం కోసం శనివారం రాత్రి మంగళగిరి పట్టణంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎస్ చెంగయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ, సిఐటియు నాయకులు ఎం.బాలాజీ, మున్సిపల్ యూనియన్ నాయకులు కె.వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1623 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - తెనాలిరూరల్ : 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మర్ డి.శ్రీనివాసుల ఆధ్వర్యంలో స్థానిక న్యాయస్థానంలో లోక్ అదాలత్ నిర్వహించారు. 136 సివిలు, 1623 క్రిమినల్, ఐదు ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. భాదితులకు రూ. 8,60,67,829 పరిహారం కింద అందించారు. కేసులను న్యాయమూర్తులు ఎం. శ్రీధర్, ఎ. పవన్‌కుమార్, పి. వివేక్‌వర్ధన్, పి. రాజశేఖర్ పరిష్కరించారు. ఎన్‌వి మహేశ్వరరావు, పద్మావతి, షేక్ మీర్‌జాన్, జి. వెంకయ్య, ఆర్. దయాకిరణ్ అదాలత్ మెంబర్లుగా వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కబడ్డీలో విజేతలుగా పల్నాడు, విశాఖ

పెదకూరపాడులో ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని జిఆర్‌సిఆర్‌కె శ్రీచైతన్య పాఠశాలలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న మందడి శివరామ కాళిబాబు, రాయపూడి పాపయ్య-వెంకట సుబ్బమ్మ, తుమూలురి ఆదినారాయణ మెమోరియల్ క్రీడా పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో హోరాహోరీగా తలపడ్డారు. కబడ్డీ పురుషుల విభాగంలో పల్నాడు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానాన్ని పార్వతీపురం మన్యం జిల్లా దక్కించుకోగా మూడో స్థానాన్ని కాకినాడ, శ్రీకాకుళం జిల్లాలు కంబైన్డ్‌గా సాధించాయి. బాలురు విభాగంలో పార్వతిపురం మన్యం జిల్లా క్రీడాకారుడు మణికంఠ బెస్ట్ రైడర్ అవార్డును, పల్నాడు జిల్లాకు చెందిన జి.హరీష్ బెస్ట్ ఆల్‌రౌండర్ అవార్డులను పొందారు. బాలికల విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్టు విజయకేతనం ఎగురవేయగా ద్వితీయ స్థానాన్ని శ్రీకాకుళం జట్టు, తృతీయ స్థానాన్ని కృష్ణా, కర్నూలు జిల్లాల జట్టు దక్కించుకున్నాయి. బెస్ట్‌రైడర్‌గా విశాఖ క్రీడాకారిణి శ్రష్టయి కుమారి నిలిచారు. షటిల్ బ్యాడ్మింటల్ డబుల్స్ విభాగంలో గుంటూరుకు చెందిన విజయ్, గోపి గెలుపొందగా రెండో స్థానంలో గుంటూరుకు చెందిన జితేంద్ర, నవీన్, మూడో స్థానంలో విజయవాడ విఆర్ సిద్ధార్థ ఇంజినీర్ కళాశాలకు చెందిన ప్రవీణ్, కృష్ణ దక్కించుకున్నారు. వాలీబాల్‌లో పల్నాడు జిల్లాకు చెందిన జిఆర్‌సిఆర్‌కె పాఠశాల, గుంటూరు జిల్లాకు చెందిన మేడికొండూరు జట్లు ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నగదు ప్రోత్సాహకాలతోపాటు షీల్డ్ అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో టిడిపి పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా వికాసానికి పెద్దకూరపాడు జిఆర్‌సిఆర్‌కె శ్రీచైతన్య పాఠశాల వ్యవస్థాపకులు గుత్తా కవిత, రాములు కృషి అభినందనీయమన్నారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ యలమంచిలి శ్రీకాంత్ మాట్లాడుతూ ఆంధ్ర తరపున జాతీయ, అంతర్జాతీయ స్థాయిలకు చేరుకునే క్రీడాకారులకు శిక్షణిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు భాష్యం ఆంజనేయులు, ఏటుకూరి బ్రహ్మయ్య, వడ్లమూడి అప్పారావు, గల్లా బాబు, బెల్లంకొండ రామగోపాలరావు, అంద్ర ప్రసాద్, మద్దినేని సత్యం, గుడిపూడి బాబురావు, గల్లా శివ పాల్గొన్నారు.

పెంచడం లేదంటూనే బాదుడు

(మొదటి పేజీ తరువాయి)

చేశారని మండిపడ్డారు. తాజాగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ ఛార్జీల నియంత్రణ మండలి నోటిఫికేషన్ జారీ చేసిందని, దీని ప్రకారం రూ.15651 కోట్ల భారం ప్రజలపై పడనుందని తెలిపారు. సుంకాలు, సర్దుబాటు చార్జీలు, అదనపు లోడు చార్జీలు అంటూ రూ 28 వేల కోట్లు భారాలు వేయగా స్మార్ట్ మీటర్లతో అదనపు భారాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. నిర్ణయించిన విద్యుత్ ఛార్జీలు చెల్లించిన తర్వాత ఐదేళ్లకు ఆదాయ, వ్యయాల మధ్య లోటు పేరుతో ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేసే విధానానికి ప్రభుత్వాలు స్వస్థి పలకాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పంపిణీ సంస్థలు కార్పొరేట్ కంపెనీలతో అక్రమ ఒప్పందాలతో ప్రజలపై భారాలు వేయాలని చూస్తే మరో విద్యుత్ పోరాటం తప్పదని హెచ్చరించారు.

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో రైతులు పండించిన ఏ పంటకూ మద్దతు ధర లేదని మిర్చి, ప్రత్తి ఇతర వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని చెప్పారు. తుపాను తీవ్రతకు దెబ్బతిన్న ఉల్లి పంటకు హెక్టారుకు (రెండున్నర ఎకరాలు) రూ.50 వేలు ఇస్తామని ప్రకటించి మిన్నకుండిపోయారన్నారు. రాష్ట్రంలో 40 లక్షల ఎకరాల్లో వరి, 16 లక్షల ఎకరాలలో ప్రత్తి సాగు చేయగా ప్రస్తుతం ఆయా పంటలు మార్కెట్లోకి వచ్చాయని, ప్రభుత్వ విధానాలతో పాటు తేమ సాకుతో మద్దతు ధరకు అమ్ముకునే పరిస్థితి లేక ధాన్యం బస్తాకు రూ.500, క్వింటాళ్ పత్తికి రూ.3 వేలు నష్టానికి అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందని వివరించారు. ఇప్పటికి అమెరికా నుండి 55 లక్షల బేళ్ల పత్తి మన దేశానికి దిగుమతి అయ్యిందని, ఇది మన రైతులకు తీవ్ర నష్టమని చెప్పారు. ధరల స్థిరీకరణకు కేంద్రం రూ.7-10 వేల కోట్లు కేటాయించేదని, రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేల కోట్లు కేటాయించేదని, ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఇటువంటి విధానాల వల్ల దేశంలో ఏడాదికి 10 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇవి మరింత పెరిగే ప్రమాదం ఉందని చెప్పారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి తేమ శాతం నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మహిళలకు పావలా వడ్డీకి రుణలివ్వాలని, పొదుపు సంఘాలు బ్యాంకులో దాచుకున్న పొదుపు డబ్బులు ఇవ్వకుండా బ్యాంకర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తక్షణమే నగదు వెనక్కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయులు నాయక్, వై.రాధాకృష్ణ, ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రికి తీసుకెళ్తూ హత్య

(మొదటి పేజీ తరువాయి)

యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్లి అనంతరం కూడా ఆమెతో సంబంధం కొనసాగిస్తూ ఆమెతోపాటే ఉంటున్నాడు. ఇంటికి రెండ్రోజులకోసారి వెళ్లేవాడు. దీనిపై త్రివేణి ప్రశ్నింస్తుండేది. గొడవలు సైతం కావడంతో పెద్దలు కలుగజేసుకుని పద్ధతి మార్చుకోవాలని శ్రీకాంత్‌ను హెచ్చరించారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన ఉదయం తమ బిడ్డకు బాగోలేదని, హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని శ్రీకాంత్‌కు త్రివేణి చెప్పగా నరసరావుపేటకు ద్విచక్ర వాహనంపై తీసుకెళు న్న సందర్భంలో ఇద్దరికి మళ్లీ గొడవైంది. దీంతో పాలపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో కాలవ కట్టపై శ్రీకాంత్ వాహనాన్ని ఆపి త్రివేణిపై దాడి చేసి ఆమెతోపాటు బిడ్డను సైతం కాల్వలో తోసేయడంతో ఇద్దరూ మృతిచెందారు. దీనిపై మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి శ్రీకాంత్‌ను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా ఈ ఘటనలో శ్రీకాంత్‌తో ప్రియురాలి పాత్ర ఏమైనా ఉందా? అనే కోణంలోనూ విచారణ చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

మహిళలకు చేయూతనిచ్చేందుకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-తుళ్లూరు

మహిళలకు చేయూతను ఇచ్చేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తుళ్లూరు మేరీ మాత స్కూల్ ప్రాంగణంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'నయీ చేతన' లో పెమ్మసాని చంద్రశేఖర్ గారు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. 'నయీ చేతన' కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్, కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్, మిషన్ శక్తి, స్కిల్ కాంపిటీషన్ తదితర స్టాల్స్ ను హోం మంత్రి వంగలపూడి అనిత గారు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ మహిళల భద్రత, గౌరవం, సాధికారతను గ్రామీణ అభివృద్ధిలో ఒకటిగా నిలిపే నయి చేతన ప్రారంభించినట్టు తెలిపారు. ప్రతిఏటా సుమారు 4.5 లక్షల కేసులు మహిళలపై వేధింపులు హింసకు సంబంధించినవి నమోదు అవుతున్నాయన్నారు. రాష్ట్రంలో 100 రిసోర్స్ సెంటర్లను ప్రారంభించారని,

మరో వంద రిసోర్స్ సెంటర్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కేవలం నిర్మాణాలే కాకుండా ఆ సెంటర్లను ఉపయోగించుకునేలా ఆ సెంటర్లను నిర్వహించాలన్నారు. మహిళలకు భద్రత కరువైనప్పుడు వెంటనే రక్షణ కావాలని అనిపించినప్పుడు దేశవ్యాప్తంగా 181 నెంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. రూ.60 వేల కోట్లతో మహిళలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ జెండర్ ఈక్వాలిటీ అనేది వంటగది నుంచి ప్రారంభం కావాలన్నారు. కుటుంబ బాధ్యతలను ఆడమగతేడా లేకుండా ఇద్దరికి సమానంగా తల్లిదండ్రులు అప్పగించాలన్నారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడారు.

శంకర్ విలాస్ బ్రిడ్జిపై ఏకపక్ష ధోరణి

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్రం నుంచి రూ.168 కోట్లతో ప్రతిపాదనలకు అనుమతి పొందితే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేవలం రూ.98 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి తెచ్చారని, బ్రిడ్జి కోసం భూములిచ్చిన షాపులు యజమానులకు నష్టపరిహారం ఇవ్వకుండానే బలవంతంగా ఖాళీ చేయించారని అన్నారు. పలువురు కోర్టుకెళ్లినా, కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. అవగాహన లోపం, అనుభవరాహిత్యంతో కేంద్ర మంత్రి తప్పులు మీద తప్పులు చేస్తున్నారని, ధోరణిని మార్చుకోకుంటే వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణంపై తక్షణం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, దుకాణదారులకు సాయం అందించాలని డిమాండ్ చేశారు. చిరు వ్యాపారులకు తాము అండగా ఉంటామన్నారు. గుంటూరులో ఎమ్మెల్యేలు డమ్మిలుగా మారారని, నష్టపరిహారం అడిగిన వ్యాపారులు, దుకాణదారులపై అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ టిడిపి నాయకులు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. పరిశీలనలో డైమండ్‌బాబు, ఎన్.రాజనారాయణ, షేక్ గులాంరసూల్, వెంకటప్పరెడ్డి, ఆచారి, సుబ్బారెడ్డి, అచ్చాల వెంకటరెడ్డి, అంబేద్కర్, గోపి శ్రీనివాస్, రంగారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్య ఎంత ముఖ్యమో విలువలు కూడా అంతే ముఖ్యం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

విద్య ఎంత ముఖ్యమో విలువలు కూడా అంతే ముఖ్యమని, తాను ఈ స్థాయికి వచ్చానంటే కారణం ఉపాధ్యాయులే అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలో డాన్ బాస్కో ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలకు మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్వరో?త్సవ వేడుకలను పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన శిలఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా ఏర్పాటుచేసిన సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించారు. డాన్ బాస్కో ప్రేమ్ నివాస్ పాఠశాల వ్యవస్థాపకులు రెవరెండ్ ఫాదర్ తోమస్ చిన్నప్ప విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ డాన్ బాస్కో అంటే ప్రేమ, సేవ. అనాథలకు అమ్మగా, నాన్నగా మారిన వ్యవస్థ డాన్ బాస్కో. పెద్దలు చెప్పినట్లు కృతజ్ఞతా భావం చాలా అవసరమన్నారు. ప్రేమతో గొప్ప సేవా కార్యక్రమాలు చేపడుతున్న డాన్ బాస్కో ప్రేమ నివాసానికి గోల్డెన్ జూబ్లీ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. డాన్ బాస్కో. ఇల్లు లేని వారికి ఇల్లు అయింది, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టింది. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 35 పాఠశాలల్లో విద్యతో పాటు విలువలు అందిస్తోంది. ఈ పాఠశాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివ అద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తదితరులుపాల్గొన్నారు.

స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్, సభలో మాట్లాడుతున్న మంత్రి

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 18న ధర్నా

ప్రజాశక్తి - పొన్నూరు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ధర్నాను జయప్రదం చేయండని ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గండు శివ పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయం నందు ఏఐఎస్ఎఫ్ పొన్నూరు పట్టణ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అధ్యక్షతన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 18న జరిగే ధర్నాలో విద్యార్థులు, యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి చెన్నూరు సాయి, ఉపాధ్యక్షుడు కోట్లు, సహాయ కార్యదర్శి రవి, ఏఐఎస్ఎఫ్ నాయకులు మనీ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో దొంగతనానికి పాల్పడిన కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలో ని వేణుగోపాల స్వామి దేవాలయం, శివాలయాల్లో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ ఎన్ నాగమల్లేశ్వరావు వివరాలు వెల్లడించారు. గుంటూరు నగరాలకు చెందిన అల్లు శివశంకర్ రెడ్డి గుంటూరు శారదా కాలనీకి చెందిన ముదిగొండ పావన ఫణి క అష? చెడు వ్యసనాలకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నాయని చెప్పారు. ఈ నెల 10వతేదీన రాత్రి రెండు గంటల సమయంలో పట్టణ లోని ఐదులాంతర్ల సెంటర్లో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోల స్వామి దేవాలయం, అచ్చంపేట రోడ్డు లో ఉన్న అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలోకి అర్ధరాత్రి ప్రవేశించి సిసి కెమెరాలను ద్యంసం చేసి విద్యుత్ కట్టింగ్ మిషన్ తో హుండీలను కట్ అందులో ఉన్న చేసి నగదును దొంగిలించారని చెప్పారు.దేవాలయం కార్యనిర్వహణాధికారి సానిమెళ్ళ కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశామని వివరించారు. క్లూస్ టీం సేకరించిన వేలిముద్రల ఆధారాలతో దొంగల ఆచూకీ కనుగొన్నామని పేర్కొన్నారు. నిందుతుడు శివశంకర్ రెడ్డికి పలు నేరలతో సంబంధం ఉందన్నారు .నల్లపాడు, ప్రత్తిపాడు పోలీస్ప స్టేషన్ లలో పలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. వారి నుంచి 34వేలు నగదు, చోరికి వాడిని కటింగ్ మిషన్, ఒక బైక్, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని సిఐ చెప్పారు.. నిందితులను పట్టుకోవటంలో ప్రతి కనబరిచిన పోలీస్ సిబ్బందిని అభినందించారు.

ఎస్ఆర్ఎం వర్సిటీకి క్యూ ఎస్ఐ - గేజ్ హ్యాపీనెస్ అవార్డు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీకి ప్రతిష్టాత్మక విద్యారంగ సంస్థ క్యూ ఎస్ ఐ- గేజ్ హ్యాపీనెస్ అవార్డు లభించింది. శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీలో జరిగిన క్యూ.ఎస్.ఐ గేజ్ వార్షిక అవార్డుల ప్రధాన ఉత్సవంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్, క్వాలిటీ అషుర్యెన్స్ అండ్ ర్యాంకింగ్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్ లు సంయుక్తంగా అవార్డును అరుకున్నారు. క్యూఎస్ఐ గేజ్ సంస్థ ఏటా దేశంలోని కళాశాలలు విద్యాసంస్థల పనితీరును వివిధ రంగాల్లో విశ్లేషించి ర్యాంకులను ప్రకటిస్తుంది. ఏపీ ఎస్ఆర్ ఎం యూనివర్సిటీ పనితీరును వివిధ కోణాల్లో విశ్లేషించిన క్యూ ఎస్ఐ గేజ్ సంస్థ 2025-26 సంవత్సరానికి ఆనందమయ యూనివర్సిటీగా పరిగణించి హ్యాపీనెస్ అవార్డుకు ఎంపిక చేసింది. ఏపీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీ కి హ్యాపీనెస్ అవార్డు లభించడం పట్ల వర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణన్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడం తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు .విద్యార్థుల శ్రేయస్సుతో పాటు విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడానికి కృషి చేస్తున్నామని యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ సతీష్ కుమార్ పేర్కొన్నారు.

'చిన్నారి అక్షర సేద్యం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులు తాము మాట్లాడే భాషపై పట్టు సాధించలేని పరిస్థితుల్లో ఉన్న మాట వాస్తవం అని మంగళగిరి డాన్ బోస్కో రెక్టార్ ఫాదర్ చిన్నప్ప అన్నారు. స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆ పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టరు ఈపూరి శేషగిరి చిన్నారి విద్యార్థులలో ప్రాథమిక విద్యా నైపుణ్యం మరింత మెరుగుపరు చుకునేలా పిల్లల కోసం ఒక ప్రత్యేక పుస్తకం రూపొందించగా 'చిన్నారి అక్షరసేద్యం' (వర్క్ బుక్ ఫర్ కిడ్స్) ప్రత్యేక పుస్తకం డాన్ బోస్కో ఫాదర్స్ ముఖ్య అతిథులు గా ఆవిష్కరించారు. ఈ పుస్తకం పాఠశాల విద్యను అభ్యసించే విద్యార్థులు అందరికి చాలా ఉపయోగ కరమైన పుస్తకం అని,అలాగే ప్రాథమిక విద్యను అభ్యసించే విద్యార్థులకు మరింత ప్రత్యేక పుస్త కంగా ఉంటుంది అని డాక్టర్ ఈపూరి శేషగిరి అన్నారు. ఇటువంటి ప్రత్యేక పుస్తకం రూపొం దించి డాక్టర్ శేషగిరి చిన్నారులకు ఈ పుస్తకం అందించడాన్ని డాన్ బోస్కో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.కె ఖయ్యుమ్ భాష, డాక్టర్ చెరుకూరి ఇజ్రాయెల్, డాక్టర్ బిరుదు రవిబాబు, డాక్టర్ కొండూరు రవితేజ,పచ్చల నాగరాజు, గుండాల వరప్రసాద్, కోన శ్రీను,మరియు అందే సాంబశివరావు, 1993-94 బ్యాచ్ మిత్రులు అభినందించారు. ఈ కార్యక్రమం ఈపూరీస్ టి.వి-18 మీడియా భాగస్వామ్యం కాగా, రచయిత,సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాన్‌బాస్కో యాజమాన్యం, అతిథులు

పేరుకలపూడి సర్పంచ్‌పై కేసు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని పేలుకలపూడి గ్రామ సర్పంచ్ గంపల గంగాధర పై స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని తమ బంధువైన ఒక వితంతును బెదిరించి ఆమె పేరున ఉన్న ఎకరం పొలం తన పేరున బలవంతంగా వ్రాయించుకొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. గుంటూరులో ఉన్న ఆమె కుటుంబ సభ్యులు నల్లపాడు పోలీస్ స్టేషన్లో ఈ విషయం పై సర్పంచ్ పై కేసు పెట్టి ఉన్నారు. అనంతరం పెద్దల సమక్షంలో రాజీపడి పొలం తిరిగి ఆమెకు రాసి ఇచ్చాడు కానీ ఆన్లైన్ మరియు అడంగల్‌లో ఎక్కలేదు. ఈ క్రమంలో వితంతువు పొలాన్ని అదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తికి కౌలుకు ఇచ్చినది. బుధవారం 10వ తేదీ గంపల గంగాధర్ పొలం వెళ్లి కౌలు రైతుతో గొడవపడ్డాడు. విషయం తెలిసిన వితంతువు తన తండ్రితో కలిసి పొలం వెళ్ళగా సర్పంచ్ వారిపై చేయి చేసుకొని తిట్టినట్లు ఫిర్యాదు చేసినది. స్థానిక పోలీస్ స్టేషన్లో సర్పంచ్ పై గతంలో అనేక కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి చుట్టుపక్కల ప్రాంతాలలో అధిక రేట్లకు విక్రయిస్తున్న ఇసుక ట్రాక్టర్లపై తెనాలి తాలూకా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బాపట్ల జిల్లా కొల్లూరు పెసర్లంక క షా?నది తీరంలో అక్రమంగా ఇసుకను లోడ్ చేసి ఎలాంటి ప్రభుత్వ బిల్లులు లేకుండా విక్రయిస్తున్న 7 ట్రాక్టర్లను శనివారం పెదరావూరు గ్రామంలో గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెనాలి రూరల్ సి.ఐ షేక్ నాయిబ్ రసూల్ తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను తమ ఆధీనంలో ఉంచినట్లు ఎస్.ఐ ఆనంద్ చెప్పారు.

పేరు మార్పు/సవరణ

నా కుమార్తె: తన్విక నాగశ్రీ, D/o. కేశవపట్నం వెంకటేశ్వర్లు, నివాసం.డోర్.నెం.300, రాజీవ్ కాలనీ, నులక పేట, తాడేపల్లి, గుంటూరు జిల్లా.

ప్రస్తుతం నా కుమార్తె ఆధార్‌లో ఆమె పేరు తన్విక నాగశ్రీ అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు పుట్టిన తేది ప్రకారం పేరు మార్పు/సవరణ చేయగా కేశవపట్నం తన్విక నాగ శ్రీ, D/o. కేశవపట్నం వెంకటేశ్వర్లు (**KESAVAPATNAM THANVIKA NAGA SRI, D/o. KESAVAPATNAM VENKATESWARLU**),గా మార్పు చేయుట జరుగుతుంది. నేటి నుండి నా కుమార్తె పేరు కేశవపట్నం తన్విక నాగ శ్రీ గా పిలవబడును. ఆధార్ లో మార్పు కొరకు.

మహారాజశ్రీ గురజాల సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్)
ఐ.పి. 70/2025

బిట్వీన్ :
షేక్ సైదాబి, W/o లేటు మీరావలి, R/o ఒప్పిచర్ల గ్రామం, కారంపూడి మండలం ... పిటీషనరు
మరియు
షేక్ ఫాతిమా అండ్ 11 వగైరాలు... రెస్పాండెంట్స్ టు,
R1) షేక్ ఫాతిమా W/o సైదావలి
R2) షేక్ జానమ్మ W/o ఏడుకొండలు
R3) షేక్ చాందిబి W/o సీతారాములు
R4) షేక్ సుభాన్‌బి W/o అక్బర్
R5) షేక్ లాల్ W/o మౌలాలి
R6) షేక్ సైదాబి W/o సైదులు
R7) షేక్ బాలెసైదా W/o హుస్సేన్‌బి
R8) షేక్ జాను W/o హుస్సేన్
R9) షేక్ బేగం W/o జాను
R10) పంగులూరి నరసింహారావు S/o సత్యం
R11) షేక్ జమాల్ S/o జాను
R12) అఫిషియల్ రిసీవర్ జిల్లా కోర్టు, గుంటూరు
R1 to R11 అందరి నివాసం ఓప్పిచర్ల గ్రామం, కారంపూడి మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు ఐ.పి. 70/2025న మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనుటకు శ్రీ కోర్టువారు ది. 29-12-2025వ తేదీన వాయిదా వేసివున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారాగానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల సదరు ఐ.పి.ని (దివాలా పిటీషను) మీ పరోక్షం నందు తీర్మానించబడును.

వాయిదాతేది : 29-12-2025

చిత్తగించవలెను.
పి.హుస్సేన్‌ఖాన్,
పిటీషనర్ తరఫు న్యాయవాది

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT NARASARAOPET
I.A No.22/ 2024 in H.M.O.P No. 332/2023

Between:
Pendyala Masthan Rao
...petitioner / Plaintiff
And
Pendyala Challa Sri Pavani & other
...Respondents / Defendant

To,
Pendyala Challa Sri Pavani D/o Challa Venkateswarlu, W/o Pendyala Masthan Rao, Hindu, Aged about 30 years, Private School Teacher, R/o Door No. 7-4-129, Srirampuram, Narasaraopet Town and JCJC, Palnadu District, A.P.

సదరు పై నెంబరు H.M.O.P ను Restore చేయమని కోరుతూ పిటీషనర్ పిటీషన్ దాఖలు చేయగా రెస్పాండెంట్ అయిన మీకు పైన తెలిపిన శ్రీ కోర్టు వారి నుండి అనేక పర్యాయములు కోర్టు వారి ఎదుట హాజరు అగు నిమిత్తం కోర్టు వారు నోటీసులు పంపించినను పిటీషనర్ ను నష్టపరచు దురుద్దేశ్యంతో కోర్టు నోటీసులు తీసుకోనక రెస్పాండెంట్ అయిన మీరు కాలయాపన చేయుచున్నారు. కావున ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసు నిమిత్తం తెలియజేయుటకు గాను ది.16-12-2025వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కాగా మీరు పైన తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట ది.16-12-2025 తేదీన స్వయంగా కానీ లేదా మీ తరుపు న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా ది.16-12-2025

K.Sujith Kumar, MA,LLB,L.L.M.
Advocate, NARASARAOPET,
Palndu Dist A.P Cell No: 9160194050

బహిరంగ ప్రకటన

నా క్లయింట్స్ బూరుగుపల్లి రంజిత్ కుమార్ S/o. విక్రమార్కుడు ఫోన్: (9490397777) నివాసం. 4-22/2. మొఘల్ సెంటర్, ఉండ్రాజవరం మండలం, వినాయకుని గుడి దగ్గర, వెలివెన్ను, ఈస్ట్ గోదావరి, ఆం.ప్ర. వారు మరియు కొడాలి శ్రీ సతీష్ S/o. కోటేశ్వరరావు, ఫోన్: (9963837475) నివాసం 15-27, జువ్వలపాలెం గ్రామం, వెల్లటూరు మండలం, గుంటూరు జిల్లా, ఆం.ప్ర. వార్ల నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది. నా క్లయింట్స్ ఈ దిగువ షెడ్యూల్ దాఖలా భూమిని శ్రీమతి చల్లా పార్వతి W/o పోతురాజు నివాసం చావపాడు గ్రామం, అమరావతి మండలం, పల్నాడు జిల్లా. అమరావతి స.రి. విక్రయ దస్తావేజు నెం.704/2001 మరియు 754/2008 ర్లు తాలూకు భూమిని వారి నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించిరి. కావున ఈ షెడ్యూల్ భూమికి సంబంధించి ఏ విధమైన, చట్టపరమైన, కోర్టు సంబంధమైన వివాదాలు, అభ్యంతరాలు వున్న ఈ ప్రకటన తేదీ నాటి నుండి 10 రోజులలో తెలియజేయగలరు. ఆ తరువాత వచ్చే అభ్యంతరాలు ఏవైననూ నా క్లయింట్స్‌ను గాని, షెడ్యూలు ఆస్తిని గాని బైండ్ చేయలేవు.

షెడ్యూలు(1): పల్నాడు జిల్లా, నరసరావుపేట రి.జి॥ అమరావతి సబ్.డి॥ యిలాకా అమరావతి మండలం, పెదమద్దూరు గ్రామ పంచాయితీ ఏరియా లోని డి.నెం.156A లో య.0.35 సెంట్లున్నూ డి.నెం.156B లో య.0.34 సెంట్లు వెరసి మొత్తం య.0.69 సెంట్ల భూమికి హద్దులు.
తూ: మన్నవ కృష్ణారావు భూమి, ద: చల్లా పోతురాజు భూమి, ప: కంకణాల కోటేశ్వరరావు భూమి, ఉ: బొంత నాగయ్య భూమి

షెడ్యూలు(2): పల్నాడు జిల్లా, నరసరావుపేట రి.జి॥ అమరావతి సబ్.డి॥ యిలాకా అమరావతి మండలం, పెదమద్దూరు గ్రామ పంచాయితీ ఏరియా లోని డి.నెం.156 లో య.0.35 సెంట్లున్నూ డి.నెం.156B లో య.0.33 సెంట్లు వెరసి మొత్తం య.0.68 సెంట్ల భూమికి హద్దులు.
తూ: మన్నవ కృష్ణారావు భూమి, ద: చల్లా పార్వతి భూమి, ప: కంకణాల కోటేశ్వరరావు భూమి, ఉ: మన్నవ కృష్ణారావు భూమి

నీలగిరి కోటయ్య యమ్.ఏ.,బి.ఈడి., ఎల్.ఎల్.బి.,
న్యాయవాది, అమరావతి, పల్నాడు జిల్లా,
సెల్ నెం.9963014598.

మార్కెట్ యార్డు అధ్యక్షులుగా లింగా బ్రహ్మయ్య

ప్రజాశక్తి - దుర్గి : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన కమిటి అధ్యక్షులుగా మండలంలోని ముటుకూరు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు లింగా బ్రహ్మయ్య నియమితులయ్యారు. యార్డుకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, గౌరవ అధ్యక్షులు సహా 20 మందితో ఒక ఏడాది కాలపరిమితికి నూతన కమిటిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. గౌరవ అధ్యక్షులుగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యక్షులుగా మునుగోటి సత్యనారాయణ, సభ్యులుగా మందా మరియదాసు, కొమెరా నాగలక్ష్మీ, షేక్ ఖాసీంసైదా, నల్లబిరుదు సుజాత, కాల్వ ప్రేమకుమారి, జంకి నరసింహారావు, ముల్లపాటి కొండ, దొడ్డా వెంకటేశ్వర్లు, ఏకసిరి ఆమని, గుండాల రాజేశ్వరి, అంబటి లక్ష్మీపార్వతి, కర్నాటి మహేష్, దారా లక్ష్మీ, మరో నలుగురు నియమితులయ్యారు. నూతన కమిటికి పలువురు టిడిపి, కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

రహదారి అధ్వానం.. అయినా దక్కని స్థానం..

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని విఠంరాజుపల్లె, పిచికలపాలెం చినకం చెర్ల వరకు ఏడు కిలోమీటర్లు గుంతలమయమైన తారురోడ్డుకు సత్వరం మరమ్మతులు చేయాలని పిడిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు కోరారు. దీనిపై గ్రీవెన్స్‌లోనూ అర్జీనిచ్చామని, ఎమ్మెల్యే దృష్టికీ తీసుకెళ్లామని పేర్కొన్నారు. చాలా గ్రామాల నుండి వినుకొండకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు ప్రస్తావన ఇటీవల మంజూరైన రోడ్ల జాబితాలో లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు.

స్పెల్‌బిలో జిల్లా స్థాయి పోటీలకు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-ఈపూరు : మండల కేంద్రమైన ఈపూరు జెడ్‌పి పాఠశాలలో సమగ్ర శిక్ష, విభ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బి పోటీల్లో లెవెల్ టు, లెవెల్ త్రీ కేటగిరీల్లో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పుల్లా పద్మజ శనివారం తెలిపారు. తమ విద్యార్థులు టి.దేవినాగఅమృతశ్రీ, పి.లక్ష్మీమాధురి, కె.హంసికశైలు, బి.అభిరామ్ మండల స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారని చెప్పారు. విద్యార్థులతోపాటు ఆంగ్ల ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, షేక్ మహబూబ్ సుభాని, డి.శివనారాయణలను ఎంఇఒ-1 డి.జ్యోతి, ఎస్ఎంసి చైర్మన్ బి.ఆంజనేయులు అభినందించారు.

టెట్‌పై పార్లమెంట్‌లో ప్రస్తావించడంపై హర్షం

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును కలిసి కృతజ్ఞతలు తెలిపిన యుటిఎఫ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టెట్‌పై సుప్రీం కోర్టు ఆదేశాలను పున:సమీక్షించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో నరసరావుపేట ఎంపీ, టిడిపి ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రస్తావించడంపై యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఎంపిని ఆయన క్యాంపు కార్యాలయంలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మోహనరావు మాట్లాడుతూ యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ ప్రతిపాదనతో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని దేశ వ్యాప్తంగా సర్వీసుల్లో కొనసాగుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల భవిష్యత్‌ను ప్రభావితం చేసే కీలక అంశాన్ని ఎంపి ప్రస్తావించారన్నారు. 15 నుండి 30 ఏళ్ల అనుభవం కలిగి గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు మరోసారి టెట్ లాంటి ప్రవేశ పరీక్ష రాయాల్సి రావడం ఇబ్బందికి గురిచేసే అంశమని చెప్పారు. తమ జీవితాలను విద్యా రంగానికి అంకితం చేసిన ఉపాధ్యాయులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యతన్నారు. 2010 ఆగస్టు 23కు ముందుగా నియమితులైన ఉపాధ్యాయులకు అప్పటి ఆర్టీఈ చట్టం ప్రకారం టెట్ నుండి మినహాయింపు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంపిని కలిసిన వారిలో జిల్లా కోశాధికారి ఎం.రవి బాబు, రాష్ట్ర కౌన్సిలర్ డివి లింగయ్య, నరసరావుపేట పట్టణ అధ్యక్షులు ఒ.కోటేశ్వరావు, సీనియర్ నాయకులు ఇ.కోటయ్యస్వామి, ఎస్.రవి ఉన్నారు.

ఎంపిని కలిసిన యుటిఎఫ్ నాయకులు

లోక్‌అదాలత్‌లో 1583 కేసుల పరిష్కారం

కక్షిదారులకు రూ.4.85 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట న్యాయస్థాన భవనాల ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1583 కేసులు పరిష్కారమయ్యాయి. మోటార్ వాహన ప్రమాద కేసులను గుంటూరులోని 4వ జిల్లా అదనపు న్యాయ అధికారి శరత్‌బాబు పరిష్కరించారు. మిగతా కేసులను స్థానిక న్యాయాధికారులు 4 బెంచ్‌లుగా ఏర్పడి పరిష్కరించారు. పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు రూ.4.85 కోట్ల లబ్ధి చేకూరినట్లు న్యాయమూర్తులు తెలిపారు. న్యాయాధికారులు ఎన్.లావణ్య, ఆర్.ఆశీర్వాదంపాల్, ఎ.సలోమీ, ఎం.గాయత్రి, న్యాయవాదులు ఎం.చంద్రశేఖర్, కిరణ్‌తేజ, అమూల్య, అబ్బూరి ఏడుకొండలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో 790 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : సత్తెనపల్లి పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 790 కేసులు పరిష్కారమయ్యాయి. నాలుగు బెంచ్‌లుగా లోక్‌అదాలత్‌ను నిర్వహించగా మొదటి బెంచ్‌కు న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి, రెండవ బెంచ్‌కు ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, మూడవ బెంచ్‌కు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని, నాల్గవ బెంచ్‌కు జె.సంజన్‌కుమార్ న్యాయమూర్తులుగా వ్యవహరించారు. సివిల్ కేసులు 89, క్రిమినల్ కేసులు 258, పిఎల్‌సి కేసులు 6 పరిష్కారమయ్యాయి. రూ.3 కోట్ల 17 లక్షల 40 వేల 731 ఆర్థిక లావాదేవీలు పరిష్కారం లభించిందని లోక్ అదాలత్ మెంబర్ బుర్రి సైదయ్య తెలిపారు.

సత్తెనపల్లిలో మొదటి బెంచ్‌లో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి

ఎఎంరెడ్డి విద్యా సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డిప్లమో కళాశాల విద్యార్థులకు ఈనెల 21, 22, 23 తేదీల్లో, ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు 27, 28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయి క్రీడాల పోటీలను ఎఎంరెడ్డి విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అట్లూరి శాంతి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాలురు విభాగంలో కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, బాలికల విభాగంలో ఖోఖో, త్రో బాల్‌తో పాటు ఇండోర్ గేమ్స్‌గా చెస్, క్యారమ్స్ ఉంటాయన్నారు. ఈ మేరకు బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్ సిహెచ్ మల్లికార్జునరావు, కె.కృష్ణారెడ్డి, పి.భార్గవ్ భూషణరావు, పీడీలు ఈశ్వర్ ఇమ్మానుయేలు, తిరుపతయ్య పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో రన్నర్స్‌గా కృష్ణవేణి డిగ్రీ కాలేజీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బాపట్ల జిల్లా ఖాజీపాలెం కెవిఆర్ కెవిఆర్ - ఎంకెఆర్ కళాశాలలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాల పురుషులు, మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారని నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థినులు 6 బంగారు, 11 వెండి, 9 కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. మహిళా విభాగంలో ఎం.శిరీషా, ఎం.హేమలత, టి.కస్తూరి, ఎం.చౌడేశ్వరి, సత్యవతి, సామ్రాజ్యం,పి. మంజు భార్గవి, బి.మమత, కె.అనురాధ, వై.అనూష, వి.నీలవేణి, వి.అనంతలక్ష్మి, కె.పూజిత కుమారి, కె.వెంకట పద్మావతి, పురుషుల విభాగంలో 4x400 రిలేలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు వివరించారు. పతకాలు సాధించిన వారిని సతీష్, తిరుపతిరావు, పీడీ ఆదిబాబు, మహమ్మద్, షకీలా అధ్యాపకులు అభినందించారు.

యార్డులో సౌకర్యాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - రెంటచింతల : రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామని, యార్డులో సౌకర్యాల కల్పిస్తామని మార్కెట్ యార్డు నూతన డైరక్టర్లుగా నియమితులైన నల్లబిరుదు సుజాత, అంబటి లక్ష్మీపార్వతి, దొడ్డా వెంకటేశ్వర్లు అన్నారు. ధ్యాం ఆరబోసుకోవడానికి ఫ్లాట్ ఫారంలకు మరమ్మతులు, అంతర్గత రహదారులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తమకు పదవులు కేటాయింపునకు సహకరించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

లింగంగుంట్ల అగ్రహారం భూముల సమస్యపై ఎంపీతో ఎమ్మెల్యే భేటి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

లింగంగుంట అగ్రహారం భూముల రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారానికి సంబంధించి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం భేటి అయ్యారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న అడ్డంకులను త్వరితగతిన తొలగించి న్యాయం చేయాలని ఎంపీని ఎమ్మెల్యే కోరారు. అగ్రహారం భూములు దశాబ్దాలుగా రైతుల ఆధీనంలో ఉన్నా ఈనాం (అగ్రహారం) భూములుగా ఉండటం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అడ్డంకులు ఎదురవుతున్నాయని, దాదాపు 1,470 ఎకరాల భూమి సంబంధించిన ఈ సమస్యపై రైతులు ఎన్నోసార్లు అధికారులు, నాయకులను ఆశ్రయించారని తెలిపారు. జూన్‌లో దేవాదాయ శాఖ మంత్రిని కలిసి ప్రక్రియను పొడిగించాలని రైతులు కోరగా సెప్టెంబర్‌లో సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు. ఎంపీని కలిసినవారిలో టిడిపి నాయకులు కపిలవాయి విజయ్ కుమార్, గంగుల పెద్దిరెడ్డి ఉన్నారు.

లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో రికార్డు

సివిల్ కేసుల పరిష్కారంలో మూడవసారి రాష్ట్రంలో జిల్లాకు ప్రథమ స్థానం



రూ.కోటి చెక్కును కక్షిదారులకు అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణచక్రవర్తి

కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి మహ్మద్‌గౌస్

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్ కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో వరుసగా మూడవ సారి గుంటూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం కేసులు 23,497 కేసులు పరిష్కారం కాగా, అందులో 1407 సివిల్ కేసులు ఉన్నాయి. ఈ కేసుల పరిష్కారం ద్వారా కక్షిదారులకు రూ.57, 68, 57, 572 కోట్లు లబ్ది చేకూరింది. శనివారం జిల్లా కోర్టుతోపాటు, జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. గుంటూరు జిల్లా కోర్టులో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించటమే లోక్ అదాలత్ లక్ష్యం అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కరించు కోవటంలో ప్రజల్లో చైతన్యం పెరిగిందని చెప్పారు. మోటారు వెహికల్ కేసులల్లో మరణించిన వారి కుటుంబాలకు లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించు కోవటం వల్ల తక్షణ సాయం అందుతుంద న్నారు. ఓ మోటారు వాహన ప్రమాదంలో పోలీసు మరణించగా, అతని కుటుంటానికి లోక్ అదాలత్‌లో జరిగిన పరిష్కారం లో రూ.1 కోటి దక్కాయన్నారు. అదే విధంగా విజ్ఞాన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ట్రస్ట్, డాక్టర్ పి.రాజారామ్మోహన్ మధ్య 2021 నుండి పెండింగ్‌లో ఉన్న ఐదు చెక్ బౌన్స్ కేసులను పరిష్కరిం చటం ద్వారా రూ.20 కోట్లు రాజీ కుదిర్చినట్లు చెప్పారు. భార్యా భర్తలు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించి, వారు తిరిగి కలిసి జీవించే విధంగా కృషి చేయటం జరుగుతు ందన్నారు. కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ సెక్రెటరీ, న్యాయ మూర్తి సయ్యద్ జియావుద్దీన్, జిల్లా అదనపు న్యాయ మూర్తులు వి.ఎ.ఎల్. సత్యవతి, వై.నగరాజ, వెంకట నాగశ్రీనివాసరావు, ఆర్.శరత్‌బాబు, కె.నీలిమ, జి.చక్ర పాణి, ఇతర న్యాయ మూర్తులు, న్యాయవాదులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి చేసిన న్యాయమూర్తులు, న్యాయవాదులకు, సిబ్బందికి డిఎల్ఎస్ఎ కార్యదర్శి జియావుద్దీన్ అభినందనలు తెలిపారు.

జిల్లాలో పరిష్కారం అయిన కేసుల వివరాలు

సివిల్ కేసులు	1407
క్రిమినల్ కేసులు	21,415
చెక్ బౌన్స్ కేసులు	578
ప్రీ లిటిగేషన్ కేసులు	97
మొత్తం కేసులు	23,497

మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : సిపిఎం

మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి - పెదకాకాని : వరి ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం మండల కేంద్రమైన పెదకాకాని లో పలువురు రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తుపాన్లను ఎదుర్కొని ఒకటికి రెండు సార్లు విత్తనాలు నాటి పంట వేసిన నాటి నుండి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంట పండించిన రైతుకు ప్రభుత్వం ప్రకటించిన బస్తాకు రూ.1792 మద్దతు ధర అందని ద్రాక్షగా మారిందని అన్నారు. ప్రభుత్వం రూ.1792కు ధాన్యం బస్తాను కొనుగోలు చేయాలని ప్రకటించగా అధికారులు తేమశాతం 17శాతంకు మించి ఎక్కువ ఉందని, ధాన్యాన్ని తరలించే ట్రాక్టర్లకు జిపిఎస్ లేదని వంకలు పెడుతున్నారు అన్నారు. ట్రాక్టర్లకు జిపిఎస్ సిస్టం ఉండదని, మారుతున్న వాతావరణ పరిస్థితులు ప్రభుత్వానికి ఎందుకు అర్థం కావట్లేదో తెలియడం లేదన్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని దళారులు బస్తాకు రూ.1300 నుండి రూ.1400 లకు రైతుల నుంచి కొంటున్నారన్నారు. గత ఏడాది ఎకరాకు 40 నుండి 45 బస్తాలు వస్తే అతివృష్టి వల్ల 30 బస్తాలే దిగుబడి వచ్చింది అన్నారు. కౌలు రైతులు పెట్టిన పెట్టుబడి లేక ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొంటుంది అన్నారు. ప్రభుత్వ నిబంధనల వల్ల గిట్టుబాటు ధర లభించక పోవడంతో రైతులు ఎకరాకు 12వేల నష్టంతో ధాన్యాన్ని దళారులకు అమ్ము కోవాల్సిన పరిస్థితి కల్పించారన్నారు. ఇకనైనా ప్రభుత్వం ఆంక్షలు సడలించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల పార్టీ అధ్యక్షుడు నన్నపనేని శివాజీ,సంకూరి నీలాంబరం,కె. సత్యనారాయణ రైతులు పాల్గొన్నారు.

గార్డెన్స్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

విస్తరణ పనులు పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో బృందావన్‌గార్డెన్స్ మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని, రోడ్డు వెంబడి ఆక్రమణలను తొలగించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శనివారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో పర్యటించి, తీసుకోవాల్సిన చర్యలపై పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. మేయర్ మాట్లాడుతూ బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్ విస్తరణ సుదీర్ఘ కాలం నుండి పెండింగ్‌లో ఉందని, ప్రస్తుత ప్రభుత్వంలో కార్యరూపం దాల్చిందని తెలిపారు. కనుక విస్తరణ పనులను నిర్దేశిత ప్లాన్ మేరకు పూర్తి చేయాలన్నారు. ఆక్రమణలను కూడా తొలగించాలన్నారు.కమిషనర్ మాట్లాడుతూ బృందావన్ గార్డెన్స్ సెంటర్ నుండి విద్యానగర్ మెయిన్ రోడ్డుకి కనెక్టివిటి రోడ్డుకు ఇరువైపులా డ్రైన్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని, సదరు రోడ్డుని 80 అడుగులకు విస్తరణ చేసిన అనంతరం డ్రైన్ల ఏర్పాటు, నూతన రోడ్ నిర్మాణం చేయాలని ఆదేశించారు. లక్ష్మీపురం, కొరెటెపాడు మెయిన్‌రోడ్లు, డ్రైన్ల వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్ విస్తరణ పనులను రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని జరిగేలా ప్లానింగ్ కార్యదర్శులకు విధులు కేటాయించాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. అనంతరం నగరంలో పలు ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఏసిపి రెహ్మాన్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో 16 నుండి అంతర్జాతీయ సదస్సు

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో అసోసియేషన్ అఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ (ఎబిఎపి) 19వ వార్షిక మహాసభ సందర్భంగా డిసెంబర్ 16 నుండి 18 వరకూ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం సదస్సు బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ కోసం హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, అగ్రికల్చర్, బయోమెడికల్ సైన్సెస్‌తో సాంకేతికత సమన్వయం' అనే ప్రధాన అంశంతో జరిగే ఈ సదస్సు జరుగుతుందన్నారు. విద్య, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణల సమన్వయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో జరుగుతున్న ఈ కార్యక్రమం దేశ విదేశాల నుండి వచ్చిన ప్రముఖ శాస్త్రవేత్తలు, అకడమిషియన్లు, పరిశ్రమ నిపుణులు, పరిశోధకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే అరుదైన అవకాశాన్ని కల్పించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కె.గంగాధరరావు, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ వీసీ ప్రొఫెసర్ ఏ.రవీందర్‌నాథ్ పాల్గొంటారన్నారు. జపాన్, కియోటో, నేషనల్ హాస్పిటల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్, చీఫ్ న్యూరాలజిస్ట్ ప్రొఫెసర్ మసాకో కినోషితా, దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వెయ్యి మందికిపైగా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. బయోటెక్నాలజీ, ఫార్మసీ విభాగాల్లో ప్రతిభావంతులకు ప్రతిష్టాత్మక లైఫ్ టైం అవార్డులు, ఫెలో అవార్డులు, జీవితకాల సాధన పురస్కారాలు, పలు అవార్డులు ప్రధానం చేయటం జరుగుతుందన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి రమణ

మరణం తర్వాత కూడా జీవించండి

ప్రజాశక్తి-గుంటూరు

మెదడు మరణం చెందిన వ్యక్తి నుండి అవయవాలను దానం చేయడం ద్వారా 8 మందికి కొత్త జీవితాన్ని ఇవ్వగలమని, మరణం మరొకరికి జీవితం కావాలని మరణం తర్వాత కూడా జీవించండి అని ప్రముఖ వైద్యులు, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. శనివారం గుంటూరులోని కొరటాల మీటింగ్ హాల్లో కోకా వీరరత్నమాల సంస్మర సభలో డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ వైద్యవిద్యార్థులకు పార్థివదేహం జ్ఞానాన్ని అందిస్తుందని శరీర, అవయవదాన ఉద్యమం ప్రజా ఉద్యమంగా జరగాలన్నారు. మహిళలే అత్యధికంగా అవయవ దానాలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో 95తో శరీర, అవయవ దానాలు చేసినవారికి అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారని రూ.10వేలు నగదు పారితోషకంగా ఇస్తుందన్నారు. అఖిలభారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకులు గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో 9 కోట్లమందిలో 2023లో కేవలం 100 మంది మాత్రమే శరీర అవయవ దానాలు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ శరీర, అవయవ దానాలను ప్రోత్సహించాలని కోరారు. జన చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో శరీర, అవయవ దానాలలో స్పెయిన్ అగ్రభాగాన ఉందని అమెరికా, చైనాలలో ప్రతి 10 లక్షల మందిలో 50 మంది శరీర అవయవ దానాలు చేస్తూ ఉంటే భారతదేశంలో ఒక్కరు మాత్రమే చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సి.హారిక, న్యాయవాది పి.స్వరూపరాణి, డాక్టర్ యోగిత, మానవత చైర్మన్ పావులూరి రమేష్, సెక్రటరీ కె.సతీష్, మానవత నేతలు చావా శివాజీ, చావా లక్ష్మి సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

లావు రత్తయ్య కు జ్ఞాపికను అందజేస్తున్న పెద్దలు.

పాలపర్రులో ఉత్సాహంగా రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్ పోటీలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలోని పాలపర్రు శ్రీ నారసింహ హైస్కూల్ లో శనివారం, ఆదివారం జరుగుతున్న 45వ రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణం లో ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విజ్ఞాన సంస్థల చైర్మన్ లావు రత్తయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ క్రీడల వలన చాలా ఉపయోగాలు ఉన్నాయని, మానసిక ప్రశాంతతో పాటు దేహ దారుఢ్యం బాగుంటుందని, ప్రతి ఒక్కరు వారికి ఇష్టమైన క్రీడల్లో రాణించాలని అన్నారు. పాలపర్రు గ్రామానికి మంచి పేరు ఉన్నదని పెదనందిపాడు అర్ట్స్ అండ్ సైన్సస్ కళాశాల స్థాపనలో ముఖ్య పాత్ర పోషించిన న్యాయమూర్తి స్వర్గీయ జస్టిస్ తేళ్ళ కృష్ణమ్మ చౌదరి, ప్రముఖ విద్యావేత్త నంగినేని చౌదరి ఈ గ్రామంలో జన్మించి గ్రామానికి చాలా మంచి పేరు తీసుకువచ్చారని తెలిపారు. ఇంటర్ వరకు బాగా చదివితే పై చదువులకు ఇబ్బందులు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వారికి విలువలు ఎక్కువగా తెలుసునని, సామాన్య పాఠశాలల్లో చదివిన వారే బాగా చదివి 70 శాతం ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారని అన్నారు. ప్రజల కష్ట సుఖాలు వారికి తెలుసని, ఆకలి అంటే తెలుస్తుందని, పంటలంటే తెలుస్తుంది, ఇవి తెలిసిన వారే భవిష్యత్ లో మంచి లీడర్ల గా ఎదుగుగుతారని అయన చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎం వరప్రసాద్, జిల్లా సెక్రటరీ గణేశుని రాంబాబు, జిల్లా జాయింట్ సెక్రెటరీ చెన్నుపాటి శివ నాగేశ్వరరావు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముద్దన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

రాజుపాలెం మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - రాజుపాలెం

రాజుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన యూటీఎఫ్ మండల శాఖ కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్. ఖాసీం పీరా , జిల్లా సహాధ్యక్షులు జె.వి.డి.నాయక్ పర్యవేక్షణలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో రాజుపాలెం మండల శాఖకు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు కొలసాని శ్రీనివాసరావు, అధ్యక్షులు విజయ రాజు, సహాధ్యక్షులు కన్నా శివ కోటేశ్వరరావు, సహాధ్యక్షురాలు బి. లిల్లీమార్గరేట్, ప్రధాన కార్యదర్శి ఫణి కుమార్‌బాబు, కోశాధికారి బాలాజీ నాయక్ ఎన్నికయ్యారు. వీరికి పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీం పీరాతో పాటు నాయకులు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి వినుకొండ

మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మహిళా పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కార్యాలయం నందు మ్యూజికల్ ఛైర్స్, లెమన్ %డ% స్పూన్ ఆటల పోటీలు నిర్వహించారు. తదుపరి ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి చీరలు బహుమతిగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

"పెన్షనర్స్ డే"ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వినుకొండ

ఈనెల 17వ తేదీన పెన్షనర్స్ డే మరియు 18వ వార్షిక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారుల సంఘం, వినుకొండ తాలూకా ప్రధాన కార్యదర్శి కె.కృమూర్తి తెలిపారు. స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనము నందు ఉదయం 9 గంటలకు పతాక ఆవిష్కరణతో మొదలయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్ ఎస్. సురేష్, ఉప ఖజానా అధికారి బిహెచ్ పి. శేష సాయి, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ పి. కోటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెన్షనర్ల సంఘ సభ్యులందరూ హాజరవ్వాలని కోరారు.

సేవారంగంలో వాసవి క్లబ్ ముందంజ

ప్రజాశక్తి - మాచర్ల

సేవా రంగంలో వాసవి క్లబ్ ముందంజలో ఉందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మేడం నాగేశ్వరావు అన్నారు. శనివారం వాసవి క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు నిర్వహించిన జోన్ సోషల్ సంబరాల కార్యక్రమానికి మేడం నాగేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలకు జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. అనంతరం జోన్ పరిధిలోని వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులను జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు దుశ్శాలతో సత్కరించి మెమెంటోలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భవనాసి రవితేజ, బత్తుల వీర బ్రహ్మం, బచ్చు రాజ్ కుమార్, ఆర్ఎస్ చుండూరు సత్యనారాయణ, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ వ్యవస్థాపక అధ్యక్షులు తిరువీధుల వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ పిడుగురాళ్ల నూతన కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

యుటిఎఫ్ పిడుగురాళ్ల మండల శాఖ నూతన కౌన్సిల్ సమావేశలో శనివారం అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన పిడుగురాళ్ల మండల శాఖగౌరవాధ్యక్షులుగా జి.ప్రసాదరావు, అధ్యక్షులుగా ఎస్.మరియదాసు, సహాధ్యక్షుడిగా పి. నాగేశ్వరరావు, సహాధ్యక్షురాలుగా ఎస్.కె.ఎం.సుల్తానా, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, ఆడిట్ కన్వీనర్‌గా నాళం ఏడుకొండలు, మహిళా కార్యదర్శిగా యు. పార్వతి ఎన్నుకున్నట్లు వారు తెలియజేశారు.

ముగిసిన బాల మహోత్సవ్ జోనల్ పోటీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తల్లిదండ్రుల ఆశలను విద్యార్థులే నెరవేర్చాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. నరసరావుపేట డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన బాల మహోత్సవ్ జోనల్ పోటీలు శనివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటువంటి ఉత్సవాలలో పాల్గొనడం ద్వారా సమాజంలో ఎలా మెలగాలి, సమూహంతో ఎలా పనిచేయాలో తెలుస్తుందన్నారు. ప్రతి విద్యార్థి మానసికంగా, శారీరకంగా ధ అఢంగా ఉండాలని ఓటములను తట్టుకునే మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకుని లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. మారుతున్న జీవన శైలిలో ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలలో ఆసక్తి చూపాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రియేటివిటీ, ఇన్నోవేషన్‌తో ముందుకు సాగాలన్నారు. బాల మహోత్సవ్‌లో భాగంగా బాలబాలికలకు నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, 100 మీటర్లు, 800 మీటర్లు, 4 , 100 రిలే, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు, విలువైన నగదు బహుమతులు అందజేశారు. అండర్ 14 బాయ్స్ - 4, 100 రిలే - లయోలా హై స్కూల్, వినుకొండ, మొదటి స్థానం, సంసిద్ధ హై స్కూల్ వినుకొండ రెండవ స్థానం లో నిలిచాయి. అండర్ 17 బాయ్స్ - 4, 100 రిలే - లయోలా హై స్కూల్, వినుకొండ, మొదటి స్థానం సింధు హై స్కూల్, నరసరావుపేట రెండవ స్థానం లో బహుమతి సాధించాయి.అండర్ 14 బాలికలు సింధు హై స్కూల్ నరసరావుపేట మొదటి స్థానం, అండర్ 17 గర్ల్స్ ఖోఖో జడ్.పి.హెచ్.ఎస్ హై స్కూల్ కొచ్చర్ల మొదటి స్థానం సంసుద్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, నరసరావుపేట రెండో స్థానలలో నిలిచాయి. బాల మహోత్సవ్‌లో నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట నియోజకవర్గాల్లోని 56 కు పైగా పాఠశాలల నుంచి 2 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలు, నగదు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కోచ్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ రిటైర్డ్ డీజీపీ మహేంద్రరెడ్డి, ఐఎఫ్ఎస్ అంబాసిడర్ సిహెచ్ రాజశేఖర్ ఇతర ప్రముఖులు

ఏపీఆర్‌జేసీలో ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల నాగార్జునసాగర్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం 50సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైమ్యాట్ డైరెక్టర్, ఏపీఆర్‌ఐ కార్యదర్శి వి.ఎన్. మస్తానయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.. రెండు రోజులుపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గురు సత్కారం జరిగింది 1975వ సంవత్సరం నుండి ప్రస్తుతం అధ్యాపకులు గా ఉన్న వారి వరకు 118 అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎన్.సరోజిని మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఐఏఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్. ఐఎస్ఎఫ్ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలలో, వివిధ రంగాలలో ఉన్నతులుగా చేసినటువంటి కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పని చేయడం చాలా గర్వపడుతున్నానని తెలినారు. గురువుల గౌరవం మసకబారుతున్న సమయంలో తమ గురువుల పట్ల గౌరవాన్ని సజీవంగా ఉంచి తమ గురుభక్తిని చాటుకుని కళాశాల పూర్వ విద్యార్థులు ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏపీఆర్జేసి పూర్వవిద్యార్థులు ఏ. సైదారెడ్డి, యస్ నాగచారి, డాక్టర్ కె.వీరనంది, డాక్టర్ చక్రపాణి, జి.గోపాలరావు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్రాంత డీజీపీలు ఎం,మహేంద్రారెడ్డి, డాక్టర్ కె.వెంకటేశం, ఐఏఎస్‌లు, ఐఎఫ్ఎస్ అంబాసిడర్ సిహెచ్.రాజశేఖర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర సమగ్రాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని అల్లూరివారిపాలెం గ్రామ టిడిపి సీనియర్ నాయకులు నడిపినేని గిరిధర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో నరసరావుపేట మండలంలోని అల్లూరివారిపాలెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షలు, మండల పరిషత్ రూ.15 లక్షల నిధులతో సిసి రోడ్లు నిర్మించామన్నారు. ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

అరవిందబాబు సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. గతంలో చిన్న చిన్న వర్షాలకే మురుగు నీరు రోడ్డు పైకి చేరి ప్రజలు ఇబ్బందులు పడేవారని సిసి రోడ్డు నిర్మాణంతో సమస్య శాశ్వంతంగా పరిష్కారమైందని అన్నారు. గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు అధికారులకు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

పేదల ప్రాణాలను నిలబెడుతున్న సీఎం రిలీఫ్ ఫండ్ : చీఫ్ విప్ జీవీ

చెక్కులు అందజేస్తున్న చీఫ్‌విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

ప్రణాపాయస్థితిలో ఉన్న నిరుపేదలను ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సహాయం అందజేస్తూ ఆదుకుంటుందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక చీఫ్ విప్ కార్యాలయంలో శనివారం జీవి ఆంజనేయులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ముఖ్యమంత్రి సహాయ ఇది ఒక వరమని, వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న సీఎం సహాయ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 నెలల కూటమి పాలనలో వినుకొండ నియోజకవర్గంలోని 1260 మంది పేద కుటుంబాలకు సీఎం చంద్రబాబు నాయుడు 8.89 కోట్లు సీఎం సహాయ నిధులు అందించి ఆదుకోటం పట్ల ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక స్తోమత లేక చికిత్స చేయించుకునే పేదవాళ్ళ ఇబ్బంది పడకూడదని సీఎం చంద్రబాబు నాయుడు ఆలస్యం చేయకుండా సీఎం సహాయ నిధులు విడుదల చేస్తూ ఆదుకుంటున్నారని అన్నారు. ఎవరైనా బాధితులు వైద్య ఖర్చులు నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఎం.టి.ఏ. పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనిరాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం, నియోజకవర్గం పరిధిలోని ఎంటిఎ మండల శాఖలు ఏర్పాటు కార్య క్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్.టి.ఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బెజవాడ నాగేశ్వరరావు అధ్యక్షత వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా శాసన సభ్యులు పత్తిపాటి పుల్లారావు హాజరయ్యా మాట్లాడుతూ సంఘ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎంటిఏ రాష్ట్ర ఇన్‌చార్జి, మాజీ ఏపిఎన్‌జీవో అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.ఎస్.రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు, రాష్ట్ర సిపిఎస్ కన్వీనర్ గద్దె రామకోటేశ్వరరావు, పల్నాడు జిల్లా ఎన్‌టిఎ అధ్యక్షులు పోలవరపు మరియరాజు, ప్రధాన కార్యదర్శి కూరపాటి రాజా, గుంటూరు జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు పి.సాయి విశ్వనాథ్, పి.లలిత బాబు, కె.వి.రాఘవులు, పల్నాడు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కిరణ్ దాసు, సుధాకర్ పాల్గొన్నారు.

వాహనదారులతో మాట్లాడున్న ఎస్ఐ రవిబాబు

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - క్రోసూరు

వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని క్రోసూరు మండల ఎస్ఐ రవి బాబు సూచించారు. మండలంలోని దొడ్లేరులో రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన సదస్సును శనివారం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం సంభవించటంతో వ్యక్తి కుటుంబం ఆర్థిక కష్టాల పాలవుతుందన్నారు. వాహనములు నడుపు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ద్విచక్ర వాహనములను నడుపు వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. ప్రతి ఒక్కరు కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలని సూచించారు.

లెప్రసీ కాలనీలో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని చెంఘీజ్ ఖాన్ పేట పంచాయితీలోని బున్నీ నగర్ (లెప్రసీ కాలనీ)లో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో డాక్టర్ గట్టు రంగారావు సహకారంతో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఫాదర్ బాలశౌరి, అల్ఫోన్స్ రాజు బైబిల్ వాక్య పరిచర్యం చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు కేక్ కట్ చేసి కాలనీవాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. దాతలు హైదరాబాద్, పెనుకొండకు చెందిన దాతలు బిట్రా నాగమల్లేశ్వర రావు, నూలి అనుపమ సహకారంతో క్లబ్ సభ్యులు కాలనీ వాసులు 120 మందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. జాస్తి విష్ణుప్రియ, డాక్టర్ గట్టు రంగారావు, క్లబ్ ప్రెసిడెంట్ నార్నె జయలక్ష్మి, ఎ.వి.శివయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, నిర్వాహకులు

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పెదనందిపాడు

యార్లగడ్డ జయప్రద, రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారి సహకారంతో శనివారం కాకుమాను మండలంలోని కొండపాటూరు గ్రామంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. 90 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 మందికి కంటి శుక్లం ఆపరేషన్ కోసం ఎంపికయ్యారు. వీరికి పెదకాకాని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతినెలా రెండవ శనివారం కొండపాటూరులో ఉచిత కంటి వైద్య శిబిరం మెడికల్ క్యాంపు నిర్వహించటం జరుగుతుందని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు యార్లగడ్డ అంకమ్మ చౌదరి, యార్లగడ్డ వీరశేఖర్, యార్లగడ్డ సురేంద్రబాబు తెలిపారు. వైద్య శిబిరానికి శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ధ్రువ్ మహేరంజన్, కోఆర్డినేటర్ ఎం. రవి కుమార్, వైద్య సిబ్బంది హాజరయ్యారు. వైద్య శిబిరం ఏర్పాట్లను నల్లమోతు రాజేంద్ర, గన్నవనేని రాఘవరావు, కోడూరి అంకినీడు చౌదరి, చుండూరు శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న మ్యాక్సీవిజన్ సిబ్బంది

తొలి దశలో గుర్తిస్తే కంటి సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - పెదకాకాని

తొలి దశలోనే కంటి సమస్యలను గుర్తించి సరైన వైద్యం తీసుకుంటే కంటి సమస్యలను పరిష్కరించవచ్చునని డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు తెలియజేశారు. శనివారం మండల కేంద్రమైన పెదకాకానిలోని సిఐటియు కార్యాలయంలో సుందరయ్య సేవా సమితి, డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు మాట్లాడారు. మ్యాక్స్ విజన్ టెక్నీషియన్లు వంశీ, శేఖర్, రామకృష్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.బాబురావు నాయకులు ఉల్లంగుల శివయ్య, కౌలు రైతు సంఘం నాయకులు సంకూరి నీలాంబరం, కె.సత్యనారాయణ, సిపిఎం నంబూరు శాఖ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు

కొమ్మూరి రత్తయ్య సదావర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొమ్మూరి రత్తయ్య సదావర్తి ట్రస్ట్ ఫౌండర్. ఫ్యామిలీ ఫౌండర్. ఫ్యామిలీ మెంబర్ కొమ్మూరి సుబ్బారావు ఆధ్వర్యంలో ఈవో కావూరి శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కొమ్మూరి రత్తయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రస్ట్ మెంబర్ కొమ్మూరి సుబ్బారావు మాట్లాడుతూ పేద బడుగు బలహీనవర్గాల సాధువుల ఆకలి తీర్చేందుకు కొమ్మూరి రత్తయ్య వంటి వారు ఈ విధంగా సదావర్తి ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. రత్తయ్య ట్రస్ట్ మెంబర్ కొమ్మూరి సుబ్బారావు, కుటుంబ సభ్యులు, అవ్వారు ఆదెమ్మ ధర్మ సత్రం ఫౌండర్ ట్రస్ట్ అవ్వారు వెంకటేశ్వరరావు, ఇంటర్నేషనల్ ఆర్య వైశ్య సంఘం కార్యదర్శి బాపనపల్లి ప్రభాకర లక్ష్మీ ప్రసాదరావు, ఈవో కావూరి శ్రీనివాసరావు, దేవస్థానం సిబ్బంది, పురప్రజలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - చేబ్రోలు

ర్యాలీలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ఆదివారం జరిగిఏ యుటిఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని చేబ్రోలు మండల కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఖాదర్‌బాషా, పి.పార్థసారధి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ మహాసభలలో ముఖ్య అతిథులుగా ప్రముఖ విద్యావేత్త మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఆర్‌విఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వి.లక్ష్మయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. సభల్లో ప్రజలు, ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి

అవగాహన కల్పిస్తున్న గుడ్ షెఫర్డ్ సిస్టర్లు, ప్రతినిధులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

బాలల హక్కుల పరిరక్షణ కోసం, బాల్య వివాహాలు నివారణ కోసం, బడి ఈడు పిల్లలు ఎవరు బయట తిరగకుండా చదువుకోవాలని లక్ష్యంతో పనిచేస్తున్నామని సిస్టర్ విద్య అన్నారు. శనివారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వడ్డేశ్వరం కమ్యూనిటీ హాలులో బాలికలపై జరిగే లైంగిక దాడులు, బాల్య వివాహాలపై , ప్రభుత్వ ఉచిత హెల్ప్ లైన్ నంబర్ల ట్రైనింగ్ వర్క్ షాప్ జరిగింది. చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ విద్య మాట్లాడుతూ పిల్లలకు ఎదురయ్యే సమస్యలు స్వయంగా వారికి తెలియజేసి, ఏ అధికారికి రిపోర్టు చేయాలో తదితర అంశాలపై పిల్లలకు అర్థమయ్యేలా వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని అన్నారు. పిల్లలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, పాల్గొనే హక్కు, అభివృద్ధి హక్కులు ఉన్నాయని, వాటిని కాపాడేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. మహాత్మా గాంధీ, ఏపీజే అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సిస్టర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జె.ఇశ్రాయేలు, కె.అనూష, అత్తోట పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలి

ప్రజాశక్తి-తెనాలి

మాట్లాడుతున్న డాక్టర్ జీవన లత

ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని డాక్టర్ జీవన లత అన్నారు. రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం, ఆంధ్ర పారిస్ రోటరీ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వివేక పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, స్త్రీ సంబంధిత వ్యాధులు, నివారణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ జీవనలత మాట్లాడుతూ గైనిక్ సంబంధించిన సమస్యలను వివరించారు. మహిళలు విద్యార్థినులు పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రతను వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్, కార్యదర్శి గుమ్మడి వెంకట్ నారాయణ, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, వివేక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామరాజు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

విజయవాడ ప్రదర్శనలో కాటూరి విగ్రహాలు

వాజపేయి, రతన్ టాటా విగ్రహాలతో కాటూరి

ప్రజాశక్తి - తెనాలి రూరల్

విజయవాడ తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం రోడ్డు లో నేడు నిర్వహించనున్న తెలుగు వరల్డ్ ఆర్టిస్ట్స్ ఆర్ట్ సొసైటీ 4వ చిత్రకళ ప్రదర్శనలో తెనాలి కాటూరి ఆర్ట్ గ్యాలరీ రూపొందించిన పలు కళా ఖండలను ప్రదర్శిస్తున్నట్లు కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీ హర్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కాటూరి ఆర్ట్ గ్యాలరీలో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రదర్శన నిర్వాహకుల కోరిక మేరకు దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి, ప్రముఖ వ్యాపార దిగ్గజం రతన్ టాటా విగ్రహాలతో పాటు, స్టెయిన్ స్టీల్‌తో రూపొందించిన సింహం, పులి, జామెంట్రికల్ ఆకారంతో రూపొందించిన జింక. త్రీడీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఏనుగుల పోరాటం, స్టాట్యూ ఆఫ్ లిబర్టీ విగ్రహాలు ప్రదర్శించనున్నట్లు కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు.

లోక్ అదాలత్‌తో సమస్యలు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారుల సమస్యల సత్వర పరిష్కారం లభిస్తుందని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు, రాష్ట్ర హై కోర్టు ఆదేశాలమేరకు తెనాలిలో ఏర్పాటుచేసిన 5 బెంచులు ద్వారా మొత్తం 875 కేసులు పరిష్కరించినట్లు శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కక్షిదారుల దీర్ఘకాలిక సమస్యలను సత్వరమే పరిష్కరించుకోవచ్చని అన్నారు. రాజీ మార్గం ద్వారా క్రిమినల్, సివిల్ కేసుల్లో పరిష్కారం లభించిందన్నారు. భూతగాదాలు, బ్యాంకు రుణాలు, కుటుంబ కలహాలు, ట్రాఫిక్ ఉల్లంఘన, చెక్ బౌన్స్, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసుల్లో కక్షిదారులకు పరిష్కారం లభించిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం .శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.వివేక్ వర్ధన్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, బార్ కౌన్సిల్ సభ్యులు, పలువురు న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

375వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావాల్సిన బకాయిలు కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 375 రోజులకు చేరుకున్నాయి. దీక్షలను ఏఐటీయూసీ నాయకుడు కొర్రపాటి ఆదినారాయణ,కార్మికులు బూరగ అంకయ్య, ఏనుగుల రమాదేవి ప్రారంభించారు. దీక్షల్లో మొలకా శారదా, దేరంగుల రమణమ్మ, వేమూల లక్ష్మి, దామవరపు సువర్ణకుమారి, దర్శి నాగమల్లేశ్వరి కూర్చున్నారు. కార్యక్రమంలో కార్మికులు తుపాకుల నాగేశ్వరావు, షేక్ సుభాని, గురవయ్య, డి.నాగేశ్వరావు, శారమ్మ, కనక దుర్గమ్మ, శివకుమారి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కొమ్మెర్ల శివకుమార్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

శివ కుమార్‌ను అభినందిస్తున్న టి.జె.ఆర్. సుధాకర్ బాబు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇటీవల విడుదల చేసిన పదవుల జాబితాలో రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీగా ఎన్నికైన ప్రత్తిపాడు నియోజక వర్గం గుంటూరు రూరల్ మండలానికి చెందిన కొమ్మెర్ల శివ కుమార్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శివకుమార్ శనివారం వైఎస్ఆర్‌సిపి నియోజక వర్గ ఇన్‌చార్జి బాలసాని కిరణ్ కుమార్‌ను, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టి.జె.ఆర్. సుధాకర్ బాబును కలిశారు. శివ కుమార్ మాట్లాడుతూ నా పై నమ్మకం ఉంచి స్టేట్ ఎస్సీ సెల్ సెక్రటరీ పదవి ఇచ్చినందుకు జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

ఎల్‌వోసీ చెక్కు అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న ఒక్కరికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కును టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు శనివారం అందచేశారు. 6వ వార్డుకి చెందిన వేమూల శివయ్యకి 1,25,000/- వేల రూపాయల ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. సీఎం సహాయనిధి చెక్కును మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్‌కు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇట్టా భాస్కర్, 6వ వార్డ్ అధ్యక్షులు వేమూల దుర్గాప్రసాద్, తురక దుర్గారావు, టిఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు కంభం సాయి చందు, తాడిబోయిన గోపి, రహంతుల్లా, ఆచారి, గాడి శివ, షేక్ నాగూర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

18న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తెనాలి

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 18న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ పిలుపునిచ్చారు. స్థానిక గాంధీనగర్ సిపిఐ కార్యాలయంలో శనివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గండు శివ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం. కిరణ్ బాబు, ఏఐఎస్ఎఫ్ నాయకులు చెన్నూరు సాయి, కోట్లు, రవి, మణి, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ కోర్టు ఏపీపీగా మొఖమాటం సురేష్‌బాబు

ప్రజాశక్తి- గుంటూరు లీగల్

గుంటూరులో పనిచేస్తున్న కార్మిక న్యాయస్థానం బి ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాది మొఖమాటం సురేష్ బాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన పరిశ్రమల యాజమాన్యం, కార్మికుల మధ్య ఉత్పన్నమైన వివాదాలను గుంటూరులో ఉన్న ఈ కార్మిక న్యాయస్థానం పరిష్కరిస్తుంది. తుళ్లూరు మండలం అయినవోలు గ్రామం లో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన సురేష్ బాబు జెసి లా కళాశాలలో న్యాయవిద్యను అభ్యసించి తదనంతరం 2002 సంవత్సరం నుంచి గుంటూరు లోని పలు కోర్టులతో పాటు కార్మిక న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. సీనియర్ న్యాయవాది మిరియాల పిచ్చయ్య వద్ద కొంతకాలం వత్తిలో మెళుకువలు నేర్చుకొని తరువాత సొంతంగా కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. సురేష్ బాబు మూడేళ్ల పాటు ప్రభుత్వం తరపున కార్మిక న్యాయస్థానంలో ఏపీపీగా పని చేయనున్నారు.

విజేతలకు బహుమతులు అందచేస్తున్న సెక్రెటరీ, ప్రిన్సిపాల్

కెఎల్‌పి స్కూల్లో ఘనంగా క్విజ్ బి పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో శనివారం రాష్ట్రస్థాయి క్విజ్ బి పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 పాఠశాలలు పాల్గొన్నాయి. కార్యక్రమాన్ని పాఠశాల సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య హాజరై ప్రారంభించారు. సెక్రెటరీ మాట్లాడుతూ క్విజ్ పోటీలు విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందిస్తాయన్నారు. సైన్స్, మ్యాథ్స్ ఒలంపియాడ్ మాదిరిగా సోషల్ సైన్స్ ఒలంపియాడ్ రాయటానికి, బ్యాంకు, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు, మేధాశక్తిని, ఏకాగ్రతను పెంచుకోవటానికి ఈ క్విజ్ ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆనందకరమైన వాతావరణంలో ఉత్సుకతతో నేర్చుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీలకు డాక్టర్ కోటేశ్వరరావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. స్క్రీనింగ్ ద్వారా 6 జట్లను ఎంపిక చేసి, ఫైనల్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి పెద్దఅవుటపల్లికి చెందిన సాయిశ్రీనివాస్ హైస్కూల్ విద్యార్థికి షేక్.రోషన్ అన్వర్, జి.నిర్మల్, ద్వితీయ బహుమతి నలందా విద్యానికేతన్ శివసాయి శ్రీధన్ మహంతి, ధీరజ్ సిద్ధార్థ, మూడవ బహుమతి డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్ నుండి ఉత్తేజ్, రోహిత్ సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల సెక్రెటరీ నగదు బహుమతి, జ్ఞాపికలను అందచేశారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ బి.శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకలలో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

సెయింట్ ఆన్స్ మహిళా కాలేజీలో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ టి.సంధ్య అధ్యక్షతన నిర్వహించారు. రెవరెండ్ సిస్టర్ ఇంగ్నేషియస్ పి.మేరీ ముఖ్య అతిథిగా హాజరై క్రీస్తు జననం, క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, శాంతి, దయ, మానవతా విలువలు కలిగి ఉండాలని అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు క్రీస్తు జననం నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభ్యుదయ కాలేజి విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా జూనియర్ కాలేజిలో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో రన్నింగ్ రేస్, షాట్‌పుట్, రిలేరేస్, బాస్కెట్‌బాల్, జావలిన్ త్రో క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు కళాశాల డైరెక్టర్ బిఎస్ఆర్‌కె ప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు

కార్పొరేషన్‌లో గ్రామాల విలీనంపై ప్రతిష్టంభన

గుంటూరు నగరపాలక సంస్థలో గ్రామాల విలీనంపై సందిగ్ధత ఏర్పడింది. రూరల్ మండలంలోని 11 గ్రామాల విలీనం చేయాలని ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ఈమేరకు కమిషనర్‌కు లేఖ రాశారు. ఆయా గ్రామాల నుంచి తీర్మానాలు ద్వారా కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు సమర్పించారు. అయితే ఈప్రతిపాదనలను వైసిపితో పాటు టిడిపి, జనసేన కూడా వ్యతిరేకించాయి. గుంటూరులో ప్రస్తుతం ఉన్న ప్రాంతాలు, 2012లో విలీనం అయిన గ్రామాలే ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోక కనీస మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు మళ్లీ కొత్తగా 11 గ్రామాల విలీనం చేయడం సబబు కాదని మెజార్టీ కార్పొరేటర్లు వ్యతిరేకించారు. అంతేగాక కనీస కొలబద్ధలేకుండా విలీన గ్రామాల ప్రతిపాదన చేయడాన్ని పలువురు టిడిపి కార్పొరేటర్లు తప్పుపట్టారు. ఈ ప్రతిపాదనలపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయగా నగరంలో ప్రాతినిధ్యం వహిస్తున్న పలువురు ప్రజా ప్రతినిదులు గైర్హాజరు అయ్యారు. ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గళ్లా మాధవి, నశీర్ అహ్మద్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సమావేశానికి రాలేదు. గుంటూరుకు చేరువలో ఉన్న అగవత్తరప్పాడు, వెనిగండ్ల, పెదకాకాని, పుల్లడిగుంట, కొర్నేపాడు తదితర గ్రామాలను విలీనం చేయకుండా దూరంగా ఉన్న జొన్నలగడ్డ, దాసుపాలెం, మల్లవరం, గొర్లవారిపాలెం తదితర గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదించడాన్ని మెజార్టీ కార్పొరేటర్లు తప్పుపట్టారు. అంతేగాకుండా దగ్గర గ్రామాల్లోనే మౌలిక వసతుల కల్పనకు, శానిటేషన్, తాగునీటి సమస్యల పరిష్కారానికి 13 ఏళ్లుగా 10 విలీన గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు కొత్తగా 10 కిలో మీటర్ల దూరంపైగా ఉన్న గ్రామాలను విలీనం చేయడాన్ని సమావేశం ముక్తకంఠంతో వ్యతిరేకించింది. గుంటూరుకు గుండెకాయగా ఉన్న పాత గుంటూరులోనే ఇప్పటికీ అనేక సమస్యలు వెంటాడుతుంటే ఎంతో దూరంగా ఉన్న జొన్నలగడ్డ, చినపలకలూరు గ్రామాలను ఎలా విలీనం చేస్తారు. అక్కడి వారికి సౌకర్యాలు ఎలా కల్పిస్తారని టిడిపి, జనసేన సభ్యులు నిలదీశారు. మరో గుంటూరు రూరల్ మండలంలో ఉన్న 21 పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేస్తే మొత్తం మండలం రికార్డుల్లో కనుమరుగు అవుతోంది. మండల పరిషత్ కూడా ఉండదు. దీని వల్ల రాజకీయంగా తమకు చాలా ఇబ్బందులు వస్తాయని రూరల్ మండలంలోని టిడిపి, వైసిపి, జనసేన నాయకుల మధ్య తీవ్ర చర్చ జరుగుతోంది. మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్‌పిటిసి, మండల పరిషత్‌లో ఇద్దరు ఉపాధ్యక్షులు, 11 గ్రామాల్లో 11 మందికి సర్పంచ్ పదవులు, వార్డు సభ్యులు ఇలా ఎన్నో పదవులు ఆయా గ్రామాల వారికే దక్కుతాయి. అంతేగాక గ్రామాల్లో వచ్చే ఆర్థిక వనరులు మొత్తం గ్రామంలోనే ఖర్చుపెట్టుకోవచ్చు. కార్పొరేషన్‌లో కలపడం వల్ల మొత్తం ఆదాయం గ్రామాలకు దక్కదు. కార్పొరేషన్ నిధులన్నీ నగరంలోని ప్రధాన వీధుల అభివృద్ధికే ఖర్చు చేస్తున్నారని తమ ప్రాంతాలకు

వీక్షణం

అన్యాయం జరుగుతుందని ఇప్పటికే విలీన గ్రామాల కార్పొరేటర్లు, నగరంలోని వెనుకబడిన ప్రాంతాల కార్పొరేటర్లు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. 11 గ్రామాలను విలీనం చేయడం వల్ల కేవలం నాలుగు లేదా ఐదుగురు కార్పొరేటర్లు మాత్రమే వస్తారని అధికారులు చెబుతున్నారు. అయితే 11 గ్రామాలను కొనసాగిస్తే సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో కలిపి 100 మందికిపైగా పదవులు వస్తాయని మండల పరిషత్ అధికారులు పేర్కొంటున్నారు. అలాగే 18 మంది వరకు ఎంపిటిసిలు, మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా మండలంలో జనసేనకు బాగా పట్టుందని అందువల్ల వ్యూహాత్మకంగా మండలం మొత్తం కార్పొరేషన్‌లో కలిపితే జనసేన పాత్రను తగ్గించవచ్చునని కొంతమంది ఎత్తుగడ వేశారనే వాదన కూడా జనసేన నేతల నుంచి విన్పిస్తుంది. మరో వైపు డివిజన్లు పెరగడం వల్ల మొత్తం రిజర్వేషన్లు మారిపోయి తమకు కూడా రాజకీయంగా నష్టం ఉంటు ందని సీనియర్ కార్పొరేటర్లు అభిప్రాయ పడుతున్నారు. రూరల్ మండలం కొనసాగిస్తే రాజకీయంగా మండల పరిషత్,జెడ్‌పిటిసి పదవులు టిడిపి, జనసేనకు దక్కే అవకాశాలు ఉంటాయని కూడా ఆ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు అభిప్రాయపడు తున్నారు. **(ఎ.వి.డి.శర్మ)**

నవీన విద్యాసంస్థల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

నాలుగు దశాబ్దాలుగా అత్యంత వెనుకబడ్డ ప్రాంతంమైన నగరాలలో విద్యా సంస్థను స్థాపించి పేద మధ్యతరగతి వర్గాల పిల్లల విద్యాభివృద్ధికి దోహదపడిన నవీన విద్యాసంస్థల విద్యా సేవలు ప్రశంసనీయమని డిఎస్పీ జి.భానోదయ అన్నారు. స్థానిక అమరావతి రోడ్డు, నగరాలులోని నవీన విద్యాసంస్థల 46వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న డిఎస్పీ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో జ్ఞానం అనంతంగా విస్తరించిందని, భట్టీపట్టే విధానాలకు స్వస్తిచెప్పి పిల్లల అభిరుచులకు అనుగుణంగా విద్యా బోధనపట్ల తల్లిదండ్రులు విద్యాసంస్థలు శ్రద్ధ చూపాలన్నారు. విద్యపాటు సామాజిక స్పృహ పెంచే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్రీడలు, సాంస్కతిక అంశాల పట్ల శ్రద్ధ కలిగేలా చూడాలన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ సిహెచ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ వృత్తి వ్యాపారాలలో బిజీగా ఉండే

మాట్లాడుతున్న డిఎస్పీ భానోదయ

తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడిపేందుకు కృషి చేయాలని కోరారు. అధ్యక్షత వహించిన పాఠశాల ఛైర్మన్ ఏరువ చిన్నపరెడ్డి మాట్లాడుతూ పిల్లల సమగ్ర వికాసానికి తామ చేస్తున్న కషికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అనంతరం 500 మార్కులు సాధించిన 111 మందికి అచ్చమైన వెండి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వై.చిన్నమ్మ, హెచ్‌ఎం నవీన్‌రెడ్డి, డైరెక్టర్లు ఆనంద్‌రెడ్డి సునీత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డిఇఒ సలీంబాషా

ఎల్ఇఎం పాఠశాలలో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రకటించిన వందరోజుల కార్యాచరణ ప్రణాళిక తప్పనిసరిగా పాటించాలని గుంటూరు జిల్లా నూతన విద్యాశాఖ అధికారి సలీం భాషా అన్నారు. కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం పరిశీలనకు డిఇఒ శనివారం స్థానిక ఎల్ఇఎం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులను సిలబస్, ఎస్ఎ 1 మార్కులను అడిగి తెలుసుకున్నారు. షైనింగ్ స్టార్స్, రైజింగ్ స్టార్స్‌తో మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం మెనూ అమలవుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్ఈఎం హైస్కూల్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను తిలకించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఖుద్దూస్ పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

కళ్లం విద్యార్థులకు మేకర్ ల్యాబ్ ఆన్‌వీల్స్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, రోబోటిక్స్, ఐఓటి రంగాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఇన్ఫోసిస్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేకర్ ల్యాబ్ ఆన్‌వీల్ ద్వారా శనివారం కళ్లం ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వాహనం ద్వారా సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్ర పరికరాలతో కూడిన విజ్ఞాన సహకారంతో అవగాహన అందించారు. మొత్తం 25 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ సతీష్, డాక్టర్ రత్నం, ఉపాధి కల్పన అధికారి డాక్టర్ పి.ఎల్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.